క్లుప్తంగా

పెద్ద చింతరేవులలో దశమి పూజలు



ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవులలో మంగళవారం దశమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి దశమి కట్ట వరకు పల్లకీ సేవ జరిగింది. బ్రహ్మోత్సవాలు ముగియడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు మధ్వాచార్యులు భక్తులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ఈఓ కవిత, భక్తులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి



అయిజ: మండల కేంద్రం నుంచి కుటుకనూరుకు బస్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. బస్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అనంతరం డీఎం స్పందిస్తూ బస్సు సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బెంజిమెన్, బందెనవాజ్, చంద్రన్న, నారాయణ, ప్రభాకర్, వెంకటేష్, సుభాన్ పాల్గొన్నారు.

వైద్యుడిని నియమించాలి

మల్దకల్: మండలంలోని పాల్వాయిలో ఉన్న పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు. రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించకపోవడంతో భవనం నిరుపయోగంగా మారిందని వారు పేర్కొన్నారు. పశువైద్య కేంద్రానికి డాక్టర్ లేకపోవడంతో పశువులు, గొర్రెలకు వచ్చే వ్యాధులతో మృత్యువాతపడే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాల్వాయి పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని గ్రామస్తులు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని మొగిలిరావుల చెర్వు గ్రామానికి చెందిన ఆటో బాషా ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతై పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న మండల బీజేపీ నాయకులు మంగళవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగదీష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకరెడ్డి, నాయకులు బీసీరెడ్డి, యుగంధర్‌రెడ్డి, శేఖర్, నరేష్, మల్లికార్జున్, కొండన్న, తదితరులు ఉన్నారు.

అసత్య ఆరోపణలు తగదు



అలంపూర్: బీఎస్పీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు తగదని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, ఉండవెల్లి మండల అధ్యక్షుడు ప్రభుదాసు పేర్కొన్నారు. అలంపూర్ చౌరస్తాలోని దా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై నిరాధార ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. స్వేరోయిజం విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించదన్నారు. ఎందరో జీవితాలను బాగు చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు నాగరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి రిమాండ్

గద్వాల క్రైం: వేధింపులు, అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటనపై మంగళవారం ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల సీఐ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థిని పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతుందని పేర్కొన్నారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ప్లాస్టిక్‌పై పట్టింపేది?

- యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
- పర్యావరణానికి తప్పని ముప్పు



మార్లబీడులో ప్లాస్టిక్ కవర్లు, చెత్తను తొలగిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు(ఫైల్)

ధరూరు: ప్రభుత్వం ప్లాస్టిక్ నియంత్రణకు అన్ని విధాలా చర్యలు తీసుకుంది. కాని క్షేత్రస్థాయిలో అమలులో విఫలం అయ్యింది. అధికారులు కంటితుడుపు చర్యలు తీసుకొని చర్యలు తీసుకున్నారు. దీంతో యథావిధిగా ప్లాస్టిక్ వినియోగం కొనసాగుతోంది. ప్రభుత్వ అధికారుల చర్యలు, నాయకుల మాటలు ప్రకటనలకే పరిమితం అయ్యారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వ ఎన్ని చర్యలు తీసుకున్న అనుకున్న లక్ష్యం చేరుకోవడం లేదు. మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతతో పాటు నిత్యవసర సరుకులు, కూరగాయలు వంటి వాటికి సైతం ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. ఇటీవల హోటళ్లు, చికెన్, మటన్ దుకాణాల్లోనూ వీటి వినియోగం బాగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే ప్లాస్టిక్ వినియోగం పుంజుకుంది. అరికట్టాల్సిన అధికారులు దాని ఊసే ఎత్తకపోవడం శోచనీయం.

తూతూ మంత్రంగా చర్యలు

ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను మూడేళ్ల కిందట జిల్లా కలెక్టర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు మండల కేంద్రంలో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. ఆ కొద్ది రోజులు మాత్రమే ప్లాస్టిక్‌పై నిషేధం కఠినంగా వ్యవహరించారు. దీంతో ప్లాస్టిక్ వినియోగం తగ్గుముఖం పట్టింది. కొన్ని రోజుల తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి మొదటికే వచ్చింది.

పొంచి ఉన్న ముప్పు

ప్లాస్టిక్ వాడకం రోజు రోజుకు పెరుతున్న తరుణంలో అదే స్థాయిలో పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉంది. అయినా దుకాణాలలో కవర్లలోనే సామగ్రిని కొనుగోలుదారులకు ఇస్తున్నారు. 51 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగించాలని నిబంధన ఉన్నా.. ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.

నిబంధనలు పాటించాలి

వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు విక్రయించొద్దు. వినియోగదారులు ఇళ్ల వద్ద నుంచే నార లేదా పేపర్ బ్యాగులు వినియోగించేలా చూస్తాం. ప్రజలకు అవగాహన కల్పించాం. ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా జరిమానాలు విధిస్తే కొంతమేర తగ్గముఖం పట్టే అవకాశం ఉంది. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా తనిఖీలు చేస్తాం. కాగితపు, నార సంచులు వినియోగించేలా చూస్తాం.

– ఎండీ జబ్బార్, ఎంపీడీఓ, ధరూరు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



సమావేశానికి హాజరైన సభ్యులు

అలంపూర్: మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ నిత్యానంద్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీలో ఉద్యోగుల నియామకం, ఆయా వార్డుల్లో పనులకు సంబంధించిన బిల్లులు, కార్మికులకు ఏక రూప దుస్తులు, తదితర అంశాలపై సభ్యులు తీర్మానం చేశారు. సెంట్రల్ లైటింగ్ విత్ డివైడర్‌లో భాగంగా రోడ్డు విస్తరణ పనులకు అందరు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, ఏఈ మేఘనాథ్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ కేంద్రం పరిశీలన



డేటాను పరిశీలిస్తున్న జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ దివ్య

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని మంగళవారం జిల్లా క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ దివ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ కంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో కంటివెలుగు కార్యక్రమం ఏర్పాటు చేస్తారని, ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మంగళవారం 132 మంది కంటి పరీక్షలు నిర్వహించి, 26 మందికి అద్దాలు, 12 మందికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రిజ్వాన తాన్విర్, సత్యానారాయణ, చంద్రన్న, తిరుమల్‌రావు, ఏఎన్ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సమానత్వంతోనే కుల నిర్మూలన

- ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం



డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: సమాజంలో ఆర్థిక సమానత్వంతోనే కుల నిర్మూలన సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం(కేవీపీఎస్) 2023 నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని కుల వివక్ష మన దేశంలో ఉందన్నారు. దళితులు ఆర్థికంగా ఎదగడం, ఉన్నత చదువులను అభ్యసించడం ద్వారా కుల వివక్ష నిర్మూలన అవుతుందని పేర్కొన్నారు. చట్టాలు, జీఓలపై అవగాహన కల్పించే విధంగా డైరీని ముద్రించడంతో కేవీపీఎస్ నాయకులను అభినందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్న, కార్యదర్శి రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు పరంజ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్, వెంకటస్వామి, ఆంజనేయులు, కర్రెప్ప, దినకర్, యువరాజు, మహేష్, ప్రభాకర్, రాజు, మద్దిలేటి, నాగరాజు, సీఐటీయూ నాయకులు వెంకటేష్, మాలిక్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న హలీమ్ పాషా

గద్వాల అర్బన్: విద్యరంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్ పాషా, కార్యదర్శి హరీష్‌లు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో పాఠశాల, కళాశాల, యూనివర్శిటీ స్థాయిలో మౌలిక సదుపాయాలు కరవయ్యాయని విమర్శించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి గృహాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఫీజు రియంబర్స్‌మెంట్, మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 3 తేదీన జరగబోయే శీతాకాల సమావేశాల్లో బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు ఈశ్వర్, కరెప్ప తదితరులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ భరత్

ఎర్రవల్లిచౌరస్తా: డ్రాగన్ ఫ్రూట్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చునని వ్యవసాయ విస్తరణ అధికారి భరత్ అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని చాగాపురం రైతువేదికలో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు, ఆదాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నల్గొండ, ఖమ్మం, సంగారెడ్డి జిల్లాల్లో రైతులు అధికంగా సాగు చేసి అధిక ఆదాయం పొందుతున్నారని అన్నారు. దీనిని అన్ని రకాల నేలల్లో పండించవచ్చని సూచించారు. ఒక మోస్తారు చౌడునేలను కూడా ఈ పంట అనుకూలంగా ఉంటుందని వివరించారు. కాండపు కత్తిరింపు ద్వారా తల్లి మొక్క నుంచి 20 నుంచి 25 సెం.మీ పొడవు కాండాన్ని కత్తిరించి నేరుగా నాటవచ్చునని తెలిపారు. ఆసక్తి గల రైతుల వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటను సాగు చేయొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, తదితరులు ఉన్నారు.



అయిజలో విరాళాలు సేకరిస్తున్న శివభక్తులు

విరాళాల సేకరణ

అయిజ: పట్టణంలోని గుంత రామలింగేశ్వర స్వామి ఆలయం పునర్ నిర్మాణంకోసం శివమాలధారులు మంగళవారం అయిజ–గద్వాల రోడ్డుపై విరాళాలను సేకరించారు. కార్యక్రమంలో వెంకటేష, పరశురాం, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, చింతలయ్య, యుగేంధర్, శ్రీను, మురళి, వీరేష్, శివశంకర్, పరుశరాం పాల్గొన్నారు.

అమ్మా.. ఆశీర్వదించు



ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో జమ్ములమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయంలో పున్నమి రాక మొదలే అమ్మవారికి నైవేద్యాలు, వస్త్రాలు, బియ్యం బ్యాలు అందించి హారతి తీసుకున్నారు. చుట్టు పక్కల గ్రామాలు, మండలాలు, పక్క రాష్ట్రంలోని కర్నూల్ జిల్లా వాసులు, అధిక సంఖ్యలో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ నెల 5 వ తేదీ ఆలయంలో రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని నిర్వాహకులు తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

రాజోళి: మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. తుంగభద్ర నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించి డంపులు చేశారని అందుకున్న సమాచారంతో అధికారులు 10 ట్రాక్టర్లకుపైగా ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేసినట్లు తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనువాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల అవగాహన సదస్సు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాలలో మంగళవారం అదనపు ఆదాయంపై పౌరసరఫరాశాఖ అధికారి రేవతి ఆధ్వర్యంలో రేషన్ డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా దుకాణాల్లో లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన అంశాలపై డీలర్లకు వివరించారు. కార్యక్రమంలో డీలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గద్వాల అర్బన్: అర్హులందరికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నర్సింహ్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చింతలపేటలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గజేంద్ర, శ్రీను తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ధరూరు: వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నోడల అధికారి నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని హరిజన వాడ ప్రాథమిక పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా బోధించడంతో పాటు గుణత్మాక విద్య అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు డెమో క్లస్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ సీతంనాయుడు, రవిప్రకాష్, సీఆర్పీ నర్సింహులు, నీలావతి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే సంతృప్తి



మూత్రశాలను ప్రారంభిస్తున్న ఎంఈఓ కొండారెడ్డి

గట్టు: సమాజ సేవతోనే సంతృప్తి కలుగుతుందని ఎంఈఈ కొండారెడ్డి అన్నారు. మండలంలోని తప్పెట్లమొర్సులో ఎల్ఐసీ (హెచ్ఎఫ్ఎల్) వారి ఆర్థిక సహకారంతో గ్రామాలయ స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్మించిన టాయిలెట్లను సర్పంచు కృష్ణయ్యగౌడ్‌తో కలిసి ఎంఈఈ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ (హెచ్ఎఫ్ఎల్) సౌత్‌జోన్ సెక్రెటరీ బ్లెసెన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గద్వాల తిమ్మప్ప, పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, గ్రామాలయ కోఆర్డినేటర్లు పాపు, ఆంత్రూస్, జైపాల్, వెళముర్గన్, ప్రాణేష్, హెడ్మాస్టర్లు చంద్రశేఖర్, శరణప్ప, ఉపాధ్యాయులు శేఖర్‌బాబు, రాములు, అశోక్, తిరుమలేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సర్పంచు బండ్ల జ్యోతి

కేటీదొడ్డి: వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్ బండ్ల జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు నేనేకా గ్లోబల్, పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ వారి సహకారంతో ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానంలో స్థిరపడాలని కోరారు. అనంతరం విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్స్ సంస్థ అధ్యక్షుడు గిరిబాబు, న్యాయవాది వరలక్ష్మి, ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ రాజశేఖర్, ఎంపీటీసీ గీత, మండల అధ్యక్షుడు ఉరుకుందు, చక్రధర్, కురుమన్న, రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు గ్లాసుల పద్ధతి పాటిస్తే చర్యలు



అమరవాయిలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్



మల్దకల్‌లోని తాటికుంటలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ నర్సన్న

మల్దకల్: రెండు గ్లాసుల పద్ధతి పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ నర్సన్న, ఏఎ రాజశేఖర్ లు అన్నారు. మంగళవారం మండలంలోని తాటికుంటలో మంగళవారం సర్పంచు ఆంజనేయులు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో కులవివక్ష పాటించడం చట్టరిత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, ఏఈఓ ఖాజాపాషా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: పౌరహక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని అమరవాయిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుల వివక్ష పాటించకుండా సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి, కార్యదర్శి అశోక్, ఎంపీటీసీ రోషన్న, మాజీ సర్పంచ్ కాంతారెడ్డి, అధికారులు, ప్రజలు, నాయకులు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ విజయ్‌కుమార్

గట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ విజయ్‌కుమార్ వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మాచర్ల ఉన్నత పాఠశాలను ఎంపీపీ సందర్శించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న క్రమంలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీపీ విజయకుమార్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని, ముఖ్యంగా బాలికల చదువుకు ఆటంకం కలుగకుండా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులతో పాటుగా గ్రామస్తులపై ఉందన్నారు. బాల్య వివాహాలు అడ్డుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ కమలాదేవి, హెడ్మాస్టర్ నర్సింహులు, తుమ్మలపల్లి సర్పంచు చెనరాయుడు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న పరుశరాముడు

మల్దకల్: గ్రామాలలో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు తమవంతు కృషి చేయాలని లైఫ్‌ఛేంజ్ ఫౌండేషన్ సభ్యులు పరుశరాముడు, అఖిల్‌లు సూచించారు. మంగళవారం మండలంలోని పావనంపల్లిలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. పత్తి పొలాలలో తిరిగి బడి ఈడు పిల్లలతో రైతులు పొలం పనులు చేయించుకోవద్దని, వారికి ఉచిత విద్యను అందించేందుకు అందరూ కృషి చేయాలని వారు పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు శరదమ్మ, ఎండీ హకీల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ మండల కమిటీ ఏర్పాటు



అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎస్ఐ, ఎంపీడీఓలు

గట్టు: రెడ్‌క్రాస్ సోసైటీ మండల కమిటీని మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రమేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడిగా సీహెచ్ రవికుమార్ (తహసీల్దార్, గట్టు), ఉపాధ్యక్షుడిగా ఎంపీడీఓ చెన్నయ్య, ఎస్ఐ పవన్‌కుమార్, కార్యదర్శులుగా ఎంఈఓ కొండారెడ్డి, వైద్యాధికారి శశికిరణ్, పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు రెడ్‌క్రాస్ నియమ నింబంధనల గురించి చైర్మన్ రమేష్ వివరించారు. అనంతరం పూలబొకె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జాతర ఉత్సవాలు



రథాన్ని లాగుతున్న భక్తులు

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో మంగళవారం బాలయోగి శివనారాయణ స్వామి ఆశ్రమంలో 43వ అఖండ జ్యోతి ప్రారంభమైంది. మఘమాస దశమి స్వామి వారి దివ్య సమాధి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం రమాసహిత సత్యనారాయణ స్వామి వారి కల్యాణం నిర్వహించారు. జోగుళాంబ భజనబృందం సంకీర్తన. విశ్వహిందూ పరిషత్ జనహిత బృందం కోలాటాలతో పాటు కల్యాణోత్సవం, రథోత్సవం అంగరంగ వైభంగా నిర్వహించారు. ఉత్సవాలకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో పాటు జోగుళాంబ గద్వాల, కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎవరికి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. బాలయోగి శివనారాయణస్వామి జాతర ఉత్సవాలు సందర్భంగా మిఠాయి , గాజుల దుకాణాలు కిటకిటలాడాయి.